


**ఓ మహానగరంలో... ఓ పెద్ద ప్రభుత్వ కార్యాలయంలో... ఆఫీసరుగారి దగ్గర స్టెనో. ఆమె పేరు సుజాత.**

ఆ రోజు సాయంత్రం ఆరింటికి ఆఫీసు నుంచి తిరిగి వస్తూనే చాలా అసహనంగా వుందామె.

స్వాగతం చెపుతున్న తాళం కప్ప... పతి దేవుడింకా రాలేదని స్పష్టం చేస్తోంది.

హాండ్ బాగ్‌లోని 'కీ'తో దాన్ని తీసి లోపలకు వస్తూనే... హైహీల్స్ షూస్‌ని చిరాగ్గా విడిచేసింది. చేతిలోని తాళం కప్పనీ... టిఫిన్ బాక్స్ టాయిలెట్ సామానూ మనీ... వున్న హాండ్ బాగ్‌నీ విసుగ్గా డ్రాయరు మీద పెట్టి... తలుపులు లోపల గడియ వేసింది. కట్టుకున్న ఖరీదైన అమెరికన్ జార్జెట్ చీర విడిచేసి... హాంగర్‌కి వేసి సాదా చీర కట్టుకుంది. బాత్ రూంలోకి వెళ్ళి సోప్‌తో ముఖం రుద్దుకుని కాళ్ళూ, చేతులూ కుడుక్కుని 'రిఫ్రెష్' అయి వచ్చింది.

అయినా ఆమె 'మూడ్' ఏమీ బాగాలేదు.

పడక గదిలోని డబుల్ కాట్ మీద ఎవరో తోసినట్టుగా బోర్ల పడిపోయింది. ఉద్యోగం చెయ్యడం ఆడదాని పాలిట వరం అనుకుంటుందీ పాడు లోకం.

ఛీ! అది నిజంగా ఒక శాపం! ఇంకా మాట్లాడితే మహాపాపం!! దాన్ననుభవించేవాళ్ళకే తెలుస్తుందది.

ఆమెమస్తిష్కంలో ఎన్నో సంఘటనలు సినిమా రీల్‌లా తిరుగుతున్నాయ్.

మాటల ఈటెల లాంటి సంభాషణలు ఆమె చెవుల్లో గింగురు మంటున్నాయ్.

** ** **

ఒక రోజు ఉదయం...

ఇంటి పనంతా పూర్తి చేసి... స్నానం చేసి, వంట చేసి, పతిదేవుడికి భోజనం పెట్టి ఆయన ఆఫీసుకు వెళ్ళిన టనే తనుకూడా తయారయ్యి ఇంటికి తాళం వేస్తుండగా పక్క పోర్షన్ లోంచి వినిపిస్తున్న ఆడగొంతులో తన పేరు నానుతుండడం గమనించి హఠాత్తుగా నిలబడి పోయింది సుజాత.

"అద్సరే! ఆవిడెళ్ళేది ఆఫీసుకేనా?"

"నీకా అనుమానం ఎందుకొచ్చిందోయ్?"

"సినీ స్టార్‌లా ఆ మేకప్పు! మిలమిల మెరిసే సిల్కు చీర... మాచింగ్ బ్లౌజు, హైహీల్స్ షూస్, భుజానికి హాండ్‌బాగ్, తిప్పలాడిలా ఆ నడక!"

"ఇంతకీ ఏమంటావ్ నువ్వు?"

"ఆ అలంకరణ, ఆ 'షో'! అంతా ఎందుకనుకున్నావ్?"

"ఎందుకు?"

"ఆఫీసులో మగవాళ్ళని ఆకర్షించడానికి"

"ఛ!"

"ఛా లేదు ఛీ లేదు అదంతే!"

గుండె నెవరో బలంగా పట్టి పిండేసినట్టయింది సుజాతకు. 'ఉద్యోగం చేసే ఆడదంటే... సాటి స్త్రీలకే ఇంత లోకువా? ఛీ!'



తన కోపాన్ని నిరసనగా ప్రదర్శిస్తున్నట్టుగా బలంగా చప్పుడు చేస్తూ తాళం వేసింది సుజాత.

వెంటనే కామాక్షి... మీనాక్షి నోళ్ళు తక్కున మూత పడ్డాయ్!

** ** **

మరో రోజు

ఆఫీసులో అది 'లంచ్ అవర్!' జీపులో ఆఫీసర్ ఇంటికెళ్ళి పోయాడు. 'స్టాఫ్' చాలా మంది కాంపౌండ్‌లో వున్న కాంటీన్‌కి వెళ్ళారు.

తన కొలీగ్స్ నళిని, హేమ ఇద్దరూ సెలవు పెట్టారా రోజు.

ఆ చివరగా వున్న బాత్ రూం కెళ్ళి వచ్చి టిఫిన్ బాక్స్ లోని ఉప్మా తిందామనుకుని లేచి వెళ్ళింది సుజాత.

తమ టేబుల్స్ వద్దనే లంచి చేస్తున్న జంబూకరావ్, మర్కటరావు లిద్దరూ ఆమెని చూసి పళ్ళికిలించారు "గుడ్ నూన్ సుజాతగారూ!" అంటూ

తను కూడా వారికి వినయంగా 'విష్' చేసి సాగిపోయింది.

తిరిగొచ్చేటప్పుడు వాళ్ళిద్దరి సంభాషణ తన మీద సాగుతుండడం విని గోడపక్కగా నిలుచిండి పోయింది సుజాత.

"దానికి ఆ కాస్మెటిక్స్ కాస్ట్లీ చీరలు ఎలా వస్తున్నాయంటావ్? దాని కొచ్చే రెండు వేల జీతంలోనే ఇవన్నీ కొనగలుగుతోందనుకుంటున్నావా?"

"ఏమో? నాకేమీ అర్థం కావడం లేదురా"

"ఓరి మట్టి బుర్రా! అసలు సంగతి నేను చెపుతా వినరా చిట్టి నాన్నా!"

"త్వరగా!"

"మొన్నో రోజు ఆఫీసరు గాడు సుజాతకి ముఖ్యమైన డిక్టేషన్ ఇస్తూ... ఎవరినీ లోపలకు రానివ్వవద్దన్నాడు గుర్తుందా?"

"అవును"

"అప్పుడు నేనేం చేశానో తెలుసా?"

"ఏం చేశావ్?"

"వాసన పసిగట్టి అటెండర్ అలెగ్జాండర్ గాడికి అయిదు రూపాయిల నోటు కొట్టి వికెట్ గేటు మెల్లగా తెరిచి పిల్లిలా అడుగులేసుకుంటూ లోపలికడుగు పెట్టాను. అప్పుడు!"

'ఛీ' అనుకుంది సుజాత.

డిక్టేషన్ ఇస్తూ... కనీసం తనని గమనించని మంచి ఆఫీసరు మీదా తన మీదా అభూత కల్పనని అసభ్యంగా అల్లి చెపుతున్న జంబూకరావుని సుత్తిపెట్టి తల చితక్కొట్టాలనిపించింది సుజాతకు.

కానీ, తను అసహాయురాలు! తను జోక్యం కల్పించుకుని ఏమన్నా అంటే వాళ్ళింకా పేట్రేగి పోతారు.

అందుకని హైహీల్సుని బలంగా టక టకలాడిస్తూ తన రూంలోకి చేరుకోవడంతో వాళ్ళనోళ్ళు ఎవరో నొక్కినట్టుగా ఆగిపోయాయి.

** ** **

ఇంకో రోజు

సిటీ బస్సులో రద్దీ మిషతో ఆడవాళ్ళ సీట్ల దగ్గరకు చొచ్చుకు వచ్చి కుదుపులకు తప్పని సరిగా మీద పడుతున్నట్టు నటిస్తూ తన జఘన సీమకు వాళ్ళ శరీరాల్ని కావాలని తగిలిస్తున్న పురుష పురుగుల బారి నుంచి తప్పించుకుని సిటీ బస్సు దిగింది సుజాత.

ఇంకా అరకిలోమీటరు నడిస్తేగానీ తన ఇల్లు రాదు.

వాచీ చూసుకుని ఆరు గంటలయి పోతోంది గదాని వడి వడిగా అడుగు లేస్తోంది సుజాత. ఒకే నగరంలో ఉద్యోగాలయినా తనదొక మూల, ఆయనదొక మూలన్ప్!

"వాచీ చూసుకుంటోంది రోయ్ చిలక!" అన్న మాటలు వినిపించి చివ్వున వెనక్కి తిరిగి చూసింది సుజాత.

ఎవరో ఇద్దరు ఎద్దుల్లాంటి కుర్రాళ్ళు! వాళ్ళ 'డ్రస్' చూస్తే